## క్లుప్తంగా

### బుడిమిలో కుస్తీపోటీలు



**బాన్సువాడ రూరల్ :** మండలంలోని బుడిమి గ్రామంలో గురువారం అమ్మభవాని జాతర మహోత్సవంలో భాగంగా కుస్తీపోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామపెద్దలు నగదు బహుమతి అందజేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కుస్తీవీరులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో జాతర మహోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మభవాని ఆలయం నుంచి రథోత్సవం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

### జీపీ ఆస్తులు పరిరక్షించాలి



**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని 41 జీపీల ఆస్తులను పరిరక్షించాలని ఎంపీవో అబ్బాగౌడ్ సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల సమీక్షలో మాట్లాడారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, కంపోస్టు ఎరువుల షెడ్ల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. జీపీ నిర్వహణను బట్టి గ్రేడ్‌లు నిర్ణయిస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల గుర్తింపు



**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని ఆయా గ్రామాల్లో 175 మంది దివ్యాంగులను గుర్తించినట్లు ఐఈఆర్‌సీలు శ్యామల, అశ్విని తెలిపారు. గురువారం అయిలాపూర్, లింగంపేటలో నిర్వహించిన సర్వేలో ఒకరిని గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. దివ్యాంగులను గుర్తించి భవిత సెంటర్లలో పేరు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పిలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

### దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన



**నిజాంసాగర్(జుక్కల్) :** మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్, ముగ్దుంపూర్ గ్రామాల్లో గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న ఇళ్లను గురువారం తహసీల్దార్ క్రాంతికుమార్ పరిశీలించారు. రెండు గ్రామాల్లో వంటషెడ్లు, పెంకుటిళ్ల పైకప్పులు లేచిపోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాల వివరాలను సేకరించారు. ఆయా గ్రామాల్లో 26 గృహాలు దెబ్బతిన్నాయన్నారు. పూర్తిగా ధ్వంసమైన ఇళ్లకు రూ. 8 వేలు పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ. 4,400 పరిహారం అందిస్తామన్నారు.

### కంపోస్ట్ షెడ్..



**కామారెడ్డి రూరల్ :** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని కంపోస్ట్ షెడ్డును గురువారం ఇంచార్జీ డీపీవో నాగరాజు పరిశీలించారు. గ్రామాల్లోని కంపోస్ట్ షెడ్‌ల నిర్వహణను మెరుగు పర్చుకోవాలన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా ట్రాక్టర్ల ద్వారా సేకరించి కంపోస్ట్ షెడ్డులో వేసి ఎరువులను తయారు చేయాలన్నారు. నీటిఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీవో మలహరి, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ నారాయణ, గ్రామ కార్యదర్శి శోభ తదితరులు ఉన్నారు.

### చిన్నారులకు ఫుట్‌బాల్‌లో శిక్షణ



**రామారెడ్డి :** ఫుట్‌బాల్ క్రీడకు పేరుగాంచిన రామారెడ్డి మైదానంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం చిన్నారులు ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. గ్రామానికి చెందిన వ్యాయామ శిక్షకుడు వేణు ఉచితంగా శిక్షణనిస్తున్నారు. ఐదేళ్ల వయసు నుంచి చిన్నారులు ఫుట్‌బాల్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

# వడదెబ్బతో ప్రజలు సతమతం

- కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
- ఎల్లారెడ్డి దవాఖానాలో 300 దాటిన ఓపీ

**ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి):** ఎండల తీవ్రత కారణంగా రోజురోజుకూ వడదెబ్బ సోకిన బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. వివిధ పనులపై బయటికెళ్లిన వారు వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో ఎల్లారెడ్డి ఆస్పత్రిలో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

**రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు**

ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన జనాలు వారానికి వంద మందికి పైగా జ్వరాలు, వాంతులు, విరోచనాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధపనులపై బయటకు వెళ్లేవాళ్లు తప్పనిసరిగా వడదెబ్బ బారిన పడుతున్నారు. భోజన చేయక పోవడం, వాంతులు, విరోచనాలు కావడం, తీవ్రమైన జ్వరంతో బాధపడి ఆస్పత్రిలో చేరుతున్నారు. సాధారణ రోజులలో ప్రభుత్వ ఆస్పత్రిలో వంద నుంచి 150 మంది వరకు ఓపీ పేషెంట్లు వస్తుండగా వేసవి తీవ్రత కారణంగా ప్రతి రోజు 200 నుంచి 300 వరకు ఓపీ పేషెంట్లు వస్తున్నారు. వీరిలో ఇరవై నుంచి 25 మంది వరకు అడ్మిట్ అయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వడదెబ్బ బాధితులతో ఆస్పత్రి ఆవరణ కిక్కిరిసిపోతోంది.



ఎల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

**వడదెబ్బ లక్షణాలు..**

ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురైన వారికి తీవ్రమైన జ్వరం, వాంతులు, విరోచనాలు కావడం కళ్లు బైర్లు కమ్మినట్లు కావడం, తలతిప్పి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. దీంతో పాటు నోరు ఎండి పోయినట్లు అనిపించడం, అధికంగా దాహం వేస్తుంది. తీవ్రమైన జ్వరం కాని, వాంతులు విరోచనాలైతే కనిపిస్తే తక్షణం ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకోవాలి.

### కూలర్లకు పెరిగిన డిమాండ్

**ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) :** భానుడి తాపానికి తట్టుకునేందుకు ప్రజలు ఎక్కువగా కూలర్లను వాడుతున్నారు. దీంతో వాటిని విపరీతమైన డిమాండ్ పెరిగిపోయింది. డిమాండ్‌తో ధరలు కూడా పెరిగిపోయాయి. రూ. 2వేల సాధారణ కూలర్ ప్రస్తుతం రూ. 3 వేలకు అమ్ముతుండగా, బ్రాండెడ్ కూలర్లు షాటేజ్ ఏర్పడడంతో వాటి ధరలు కూడా రూ. 500 నుంచి రూ. 1000కి పెరిగింది.వేసవి వచ్చిందంటే చాలు సామాన్యుడిపై పెనుభారం పడుతోంది. ఎండ తీవ్రత కోసం కూలర్ల కొనుగోలుతో ఆర్థికభారం పడుతోంది.

**నిర్మానుష్యంగా రోడ్లు..**

ఎండ తీవ్రత కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత 43 నుంచి 44 డిగ్రీల వరకు చేరిన కారణంగా జనాలు బయట తిరగాలంటేనే జంకుతున్నారు. దీంతో ఇంట్లో కూలర్ల వినియోగం పెరిగిపోయింది.



ఎల్లారెడ్డిలో అమ్మకానికి ఉంచిన కూలర్లు

### జాగ్రత్తలు అవసరం

ఎండల తీవ్రత కారణంగా జనాలు ఎండ బారిన తిరగవద్దు. చల్లని సమయంలో ఉదయం 10 గంటలలోగా, సాయంత్రం 5 గంటల తర్వాత వ్యక్తిగత పనులను చేసుకోవాలి. ఎండలో వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డకట్టుకుని వెళ్లాలి. లేదా గొడుగు వాడాలి. బయటకు వెళ్లే సమయంలో చల్లటినీళ్లు తాగి వెళ్లాలి. ఓఆర్‌ఎస్ తాగడం, కొబ్బరిబొండాలు తాగం చేయాలి.

– డాక్టర్ రవీంద్రమోహన్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, ఎల్లారెడ్డి

# బుద్ధపౌర్ణమి ప్రత్యేక పూజలు



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎల్లారెడ్డిలో బుద్ధుడి చిత్ర పటానికి పూజలు

**లింగంపేట(ఎల్లారెడ్డి) :** మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం బుద్ధపౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లింగంపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నదానం చేశారు. లింగంపేట బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు రాజారాం సురేశ్ జహీరాబాద్ ఎంపీగా బీబీపాటిల్ గెలవాలని పూజలు చేశారు. కార్యక్రమంలో సుధాకర్‌శర్మ పంతులు, బిజేవైఎం జిల్లా నాయకుడు దాసరి అనిల్, భక్తులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డిలో బుద్ధపౌర్ణమి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బుద్ధ పౌర్ణిమ జయంతి సందర్భంగా బుద్ధుడి చిత్ర పటానికి స్థానిక నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బబ్లూ, సాయిబాబా తదితరులున్నారు.

### కొనుగోలు కేంద్రాల పరిశీలన



**ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) :** మండలంలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మహేందర్‌కుమార్ గురువారం పరిశీలించారు. మండలంలోని లింగారెడ్డిపేట, పోసానిపల్లి తదితర గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలును పూర్తి చేసి కేంద్రాలను మూసివేయాలన్నారు. జిల్లా అధికారుల సూచన మేరకు ధాన్యం కొనుగోలు మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం నాటికి పూర్తవుతుందని అన్నారు. కార్యక్రమంలో గిర్దావార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

### గొర్రెలకు టీకాలు ఇప్పించాలి



**కామారెడ్డి రూరల్ :** గొర్రెలకు టీకాలు ఇప్పించాలని కోరుతూ గురువారం కామారెడ్డి మండలం లింగాయిపల్లి మాజీ ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నాగల్ల రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సింహారావుకు వినతి పత్రం అందజేశారు. గొర్రెలకు అంతుచిక్కని వ్యాధులు, అమ్మోరు, తదితర వ్యాధులతో మృతి చెందుతున్నాయని ఈ విషయమై సంబంధిత వైద్యుడికి చెప్పినా పట్టించుకోవట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరులు మదిరె శివయ్య, తిరుపతి, లింగం తదితరులున్నారు.

# వైభవంగా రథోత్సవం ప్రారంభం

- రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- నేడు కుస్తీ పోటీలు

**మద్నూర్(జుక్కల్) :** మండల కేంద్రంలోని రథ్‌గల్లీలోని లక్ష్మీనారాయణ ఆలయంలో రథపౌర్ణిమ సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదానం నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని హనుమాన్ ఆలయం వరకు గురువారం రాత్రి రథం ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి వైశాఖ శుక్ల పౌర్ణమి రోజున రథోత్సవం, రథం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం చేశారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రథం ఊరేగింపు, జాతర నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సందుర్‌వార్ హన్మాండ్లు, ఉపాధ్యక్షుడు బండి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కంచిన్‌వార్ రవి, కోశాధికారి కంచిన్ నాగేశ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.



ముస్తాబైన రథం

### తల్లిదండ్రులకు పాదపూజ



**రామారెడ్డి :** సదాశివనగర్ మండలంలోని లింగపల్లి గ్రామంలోని శ్రీ కృష్ణ మందిరంలో మహానుభావ్ దీనబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు బాల సంస్కార శిబిరం నిర్వహించారు. 8 రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో చివరిరోజు శుక్రవారం 180 చిన్నారులు బాల సంస్కార శిబిరంలో భాగంగా పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు.

**నేడు కుస్తీ పోటీలు**

**మద్నూర్(జుక్కల్) :** రథోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా శుక్రవారం ఉదయం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ తెలిపింది. ఈ పోటీల్లో చుట్టు పక్కల మండలాల నుంచి మల్లయోధులు పాల్గొనవచ్చన్నారు. పోటీలో గెలుపొందిన వారికి నగదు పారితోషికం అందిస్తామన్నారు.

### ప్రజాసేవతోనే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

**పిట్లం(జుక్కల్) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీపీగా ఇది తనకు చివరి సమావేశమని ఇన్నాళ్లు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలన్నారు. ప్రజలకు సేవ చేస్తేనే గుర్తింపు వస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ అంగన్వాడీల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. గ్రామాల్లో సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీపీ కవిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

### ఎల్లారెడ్డిలో కంటివైద్య శిబిరం



**ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ,లయన్స్ క్లబ్ బాన్సువాడ ఆధ్వర్యంలో 67 మందికి ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ తదితరులున్నారు.

### మాందాపూర్ విద్యార్థుల ప్రతిభ



**బీబీపేట :** తెలంగాణ జీవ వైవిధ్య బోర్డు నిర్వహించిన పోటీల్లో మాందాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రకృతి, జీవ వైవిధ్యం, ప్రకృతి ఆవశ్యకతపై విద్యార్థులు దీపిక, శ్రీనిధి, సాహితి, అర్చన మక్కువ పెంచుకుని పోటీ పరీక్షల్లో మొదటి బహుమతి సాధించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణబాబు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

**మల్లయ్యపల్లిలో బోనాల పండగ**



**ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి):** మండలంలోని మల్లయ్యపల్లిలో గురువారం బోనాల పండగను నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలతో శోభాయాత్ర నిర్వహించి బోనాలను సమర్పించారు.

**భక్తిశ్రద్ధలతో శ్రీ నవదుర్గావ్రతం**



**కామారెడ్డి అర్బన్ :** వైశాఖ పున్నమి సందర్భంగా గురువారం స్థానిక తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీశారదా ఆదిశంకర ఆలయంలో సామూహిక శ్రీనవదుర్గ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కే మహిపాల్‌రెడ్డి, అర్చకులు సతీష్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

**25 నుంచి వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు**

**కామారెడ్డి రూరల్ :** కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో ఈనెల 25 నుంచి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న ప్రాతఃకాలం సుప్రభాత సేవ 26న ఉదయం 11 గంటలకు శ్రీ అలవేలు మంగ పద్మావతి సమేత శ్రీ లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదానం ఉంటుందన్నారు. 27న వేదాశీర్వచనం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం**



**రాజంపేట :** రాజంపేట మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా ఆలయం వద్ద గురువారం బుద్ధపౌర్ణమి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమిరోజు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. అన్నదానానికి సహకరించిన భక్తులు బత్తుల శ్రీహరి, కొండహన్మండ్లు, శెనిషెట్టి బైరమ్మలను ఆలయ కమిట సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు చిన్న సిద్దరాములు, బంధం కృష్ణమూర్తి, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

**కల్యాణం.. కమనీయం**



**మాచారెడ్డి :** మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. మేళతాళాల మధ్య స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం, తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, ఆలయ సిబ్బంది భక్తులు ఉన్నారు.

## సమాచారం..

**నేడు మండల పరిషత్ సమావేశాలు**

**కామారెడ్డి రూరల్ :** కామారెడ్డి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ తెలిపారు. ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి గౌరవ సభ్యులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

**తాడ్వాయిలో..**

**తాడ్వాయి(ఎల్లారెడ్డి) :** మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద బాయి అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు. అదేరోజు ఐకేపీ కార్యాలయంలో 2023–2024కు గాను చార్టెడ్ అకౌంటెంటుతో పాటు మండల సమాఖ్య, అన్ని వీవోఏల ఖర్చుల లావాదేవీలపై వార్షికా ఆడిట్ ఉంటుందని వివరించారు.

**దోమకొండలో..**

**దోమకొండ :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ కానుగంటి శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

# ప్రతి మొక్కను సంరక్షించాలి



బిచ్కుంద : మొక్కలకు నీళ్లు పడుతున్న ఎంపీడీవో



నస్రుల్లాబాద్: పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

**బిచ్కుంద(జుక్కల్) :** మండలంలోని రాజుల్లాలో ఎంపీడీవో గోపాల్ గురువారం నర్సరీ, వైకుంఠధామం, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎంపీవో మహబూబ్ తక్కడ్‌పల్లి, గోపన్‌పల్లిలో ప్రకృతి వనం, వర్మీకంపోస్ట్ షెడ్లను పరిశీలించారు. చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చాలన్నారు. మొక్కలపై శ్రద్ధ పెట్టాలన్నారు.

**నిజాంసాగర్(జుక్కల్) :** మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్‌లో ఉపాధిహామీ పనులను స్థానిక ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల హాజరు మస్టర్లను పరిశీంచారు. కంపోస్ట్ షెడ్, వైకుంఠదామం, నర్సరీని తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యదర్శి అంజయ్య, ఎఫ్ఏ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.



నిజాంసాగర్: మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**నస్రుల్లాబాద్(బాన్సువాడ) :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీవో రాము అన్నారు. గురువారం మండలంలోని రాముల గుట్ట తండా, లింగంపల్లి, దుర్కి, నాచుపల్లి, బొప్పాస్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. నర్సరీలో 6000 మొక్కలు అందించాలన్నారు. జీపీకార్యదర్శి భారతి ఉన్నారు.

## సంక్షిప్తం

**అందుబాటులో జీలుగ విత్తనాలు**

**గాంధారి(ఎల్లారెడ్డి) :** మండల పరిధిలోని రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో నరేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రైతులకు 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను సరఫరా చేస్తుందన్నారు. గాంధారి సింగిల్ విండోలో 333 బస్తాలు, ముదెల్లి సింగిల్ విండోలో 333 బస్తాలు, మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 166 బస్తాల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

**అంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి విరాళాలు**

**కామారెడ్డి అర్బన్ :** స్థానిక తూర్పు హౌసింగ్‌బోర్డుకాలనీలోని శ్రీశారదమాత ఆదిశంకర ఆలయంలో అభయాంజనేయస్వామి ఆలయాభివృద్ధి కోసం 11 గజాల భూదానం కింద రూ. 11వేల చొప్పున పలువురు గురువారం విరాళం అందజేశారు. గంప మహేష్–మాధవి, చిట్టిమెల్ల జగదీశ్వర్–పద్మ, పార్శి వీరేషం–సులోచన, మొగిలిపల్లి రమేష్–రాణి, పందిరి రాధకిషన్–సుగుణ, పైతరి గంగయ్య, కాశిరెడ్డి రాంరెడ్డి–స్వరూపరాణి, కారంగుల మహిపాల్‌రెడ్డి–లక్ష్మి, కోదాటి రామారావు–శోభారాణి, శేఖర్‌గౌడ్–లక్ష్మి, కాసం సతీష్–లక్ష్మి, కమ్మరి కిష్టయ్య–విజయలు రూ.11వేల చొప్పున అందజేశారు.

**విత్తనాల కోసం ఎదురుచూపులు**

**తాడ్వాయి(ఎల్లారెడ్డి) :** మండలంలో పెద్దజనుము, జీలుగ విత్తనాలను సరఫరా చేయాలని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుందని సింగిల్‌విండో పరిధిలో ఈ విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాడి కూడా విత్తనాలను సరఫరా చేయాలన్నారు.

**మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు**



**మాచారెడ్డి :** మండలంలోని కొత్తపల్లిలో నీటి ఎద్దడి పరిష్కరించడానికి మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సొంతంగా రూ. 50 వేలతో మినీ ట్యాంక్ ను ఏర్పాటు చేయించారు. ఈ మేరకు గురువారం జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి మినీ వాటర్ ట్యాంక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బాల్ చంద్రం, చౌరస్తా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, బట్టు రమేష్ తదితరులున్నారు.

**ప్రైవేట్ పాఠశాలలో ఏబీవీపీ ఆందోళన**



**కామారెడ్డి టౌన్ :** పాత రాజంపేట్ వద్ద ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏబీవీపీ నాయకులు గురువారం ఆందోళన చేశారు. శాంతినికేతన్ స్కూల్ పేరిట మరో కార్పొరేట్ పాఠశాలకు చెందిన అడ్మిషన్లు తీసుకుంటున్నారని స్కూల్ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. పాఠశాలకు అనుమతి లేకున్నా బుక్స్ విక్రయిస్తున్నారని ప్రిన్సిపాల్ చాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్, ఖలీల్, అల్తాఫ్, వరుణ్ తదితరులున్నారు.